GSTIN-NO:36FKPSI308PIZX
epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 6 | సంచిక : 258 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | శుక్రవారం 10-05-2024 | పేజీలు : 3

### ఒకే రోజు పీఎం.. సీఎం
## భారీ బహిరంగ సభలు

**టి మీడియా,మే9,నారాయణపేట:**



లోక్ సభ ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న తరుణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధినాయకుల ప్రచారాలు హోరందుకుంటున్నాయి. ఈ క్రమంలో ఈనెల10న ఒక్క గంట తేడాతో ..బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ఎన్నికల ప్రచార సభలు భారీ సభలను నిర్వహించేందుకు ఆయా పార్టీల నాయకులు సన్నద్ధం అవుతున్నారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో బీజేపీ భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు ఈ నెల10న షెడ్యూలు ఖరారు అయ్యింది. ఈ సభకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హాజరు కానుండడంతో సభను భారీ ఎత్తున నిర్వహించేందుకు పార్టీ అభ్యర్థి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ సారథ్యంలో ఆ పార్టీ నాయకులు సన్నద్ధం అయ్యారు. ఇదిలా ఉండగా..నారాయణపేట జిల్లాలోని మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ అభ్యర్థి వంశీ చందు రెడ్డికి మద్దతుగా భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు ఈ నెల 10న షెడ్యూల్ ఖరారు అయ్యింది. ప్రధానమంత్రి సభ ఆరంభమైన గంట తర్వాత మధ్యాహ్న 3 గంటల నుండి కాంగ్రెస్ సభ జరగనుంది. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. ఒకేరోజు నారాయణపేట జిల్లాలో జరిగే రెండు బహిరంగ సభలకు ఇటు ప్రధాని, అటు ముఖ్యమంత్రి హాజరవుతుండడం తో శాంతిభద్రతలను కాపాడవలసిన పోలీసులు, జన సమీకరణ చేయవలసిన నాయకులు, ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుందని పలువురు అంటున్నారు.

### సమయం లేదు మిత్రమా..! సార్వత్రిక సమరంలో గెలిచి నిలవాల్సిందే!
## ఆదివాసీల ఖిల్లా లో
# ఆదరణ ఎవరికీ..?

**పార్టీల ముప్పు తిప్పలు
సమరంలో సత్తాచాటాల్సిందే..
గెలిచి తీరాల్సిందే
నంటూశపథాలు**





**టి మీడియా,మే9, రాజకీయ ప్రతినిధి :**

సమయం లేదు మిత్రమా.. సార్వత్రిక ఎన్నికల సమరంలో సత్తాచాటాల్సిందే.. గెలిచి తీరాల్సిందే.. అంటూ ఎర్రని ఎండలను సైతం లెక్క చేయకుండా ప్రచారాన్ని మరింత హోరెత్తిస్తున్నారు ప్రధాన పార్టీల నేతలు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిదిలో ఇప్పటికే అగ్రనేతల ప్రచారాలు పూర్తికావడంతో కీలక వ్యూహాలను అమలు చేస్తూ ఓటరు దేవుళ్లను తమవైపు తిప్పుకునేందుకు ముప్పు తిప్పలు పడుతున్నారు. గెలుపు బాధ్యతలు భుజానికెత్తుకున్న ఇంఛార్జులు రాత్రి పగలు అనే తేడా లేకుండా ఎన్నికల వ్యూహాల్లో తలమునకలవుతున్నారు.కేవలం ప్రచారానికి రేపు సాయింత్రం వరకు మాత్రమే సమయం మాత్రమే మిగిలి ఉండటంతో.. సమయం లేదు మిత్రమా.. ఇక రణమే అంటూ దూసుకెళ్తున్నారు ప్రదాన పార్టీల నేతలు. ఇంతకీ ఆదివాసీల ఖిల్లా ఆదిపత్యం దక్కించుకునేది ఎవరు.? ఏ సామాజికవర్గ ఓట్లు ఏ పార్టీ ఖాతాల్లోకి చేరే అవకాశాలు ఉన్నాయి..? కొత్తగా ఓటు హక్కును సాధించుకున్న యువ ఓటరు జై కొట్టెదెవరికి..? పార్లమెంటు పరిధిలోని అత్యధిక ఓట్లను కలిగి ఉన్న మహిళా ఓటర్ల తీర్పు ఎటూ..? ఆదివాసీల ఖిల్లాలో సత్తాచాటే నేత ఎవరు..? మూడు రోజుల్లో ఎవరి తలరాతలు ఎంతలా మారనున్నాయి. ఈ స్పెషల్ స్టోరీలో చూద్దాం.ఆదిలాబాద్ ఆదివాసీల ఖిల్లా బరిలో ఉన్న ముగ్గురు నేతలు ఆదివాసీలే.. అందులోను గోండు సామాజిక వర్గానికి చెందిన మాజీ ఉపాధ్యాయులే. ఇప్పుడీ ముగ్గురికి గెలుపు తప్పని సరికావడంతో అభ్యర్థులు తీవ్రంగా చమటోడుస్తున్నారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారానికి ఇంకా కేవలం మూడు రోజులు మాత్రమే సమయం మిగిలి ఉండటం.. ప్రచార వేగాన్ని మరింత పెంచారు. ఇప్పటికే మూడు ప్రధాన పార్టీల అగ్రనేతలు ప్రచారాలు పార్లమెంట్ పరిధిలో ప్రచారం పూర్తిచేశారు కూడా. అయితే బీజేపీ, బీఆర్ఎస్ లు మాత్రం ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో తాజా అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతాన్ని నమ్ముకుని ముందుకు సాగుతుంటే కాంగ్రెస్ మాత్రం ప్రజలు కట్టబెట్టిన అధికారంతో ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీల అమలుతో భారీ ఆశలు పెట్టుకుంది. దీంతో మూడు పార్టీలు గెలుపు ఆశలు పెట్టుకోగా.. త్రిముఖ పోరులో ఎవరు గట్టెక్కుతారో అన్న చర్చ జోరుగానే సాగుతోందిఅయితే ఆదివాసీ ఖిల్లా ఆదిలాబాద్ లో ఆరు నూరైనా తమ జెండా ఎగరేయాలన్న దృఢసంకల్పంతో ఉన్న కాంగ్రెస్ అదే తీరులో ప్రచారాలు కూడా కొనసాగిస్తోంది. గెలుపు బాధ్యతలు భుజానికెత్తుకున్న ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క.. తానే అభ్యర్థి అనే స్థాయిలో గడపగడపకు ప్రచారం చేస్తూ తీవ్రంగా శ్రమిస్తున్నారు. అటు సీఎం రేవంత్ రెడ్డి సైతం ఆదిలాబాద్ పై ప్రత్యేక ఫోకస్ పెట్టి ఏకంగా మూడు సార్లు పార్లమెంట్ పరిధిలో పర్యటించి ఆదిలాబాద్ సీటు కాంగ్రెస్‌కు ఎంత అవసరమో చెప్పకనే చెప్పారు. ఏప్రిల్ 22న ఆదిలాబాద్ లో, మే 2న ఆసిఫాబాద్ లో, మే 5న రాహుల్ గాంధీ తో కలిసి నిర్మల్లో ముచ్చటగా మూడు బహిరంగ సభల్లో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగాలతో కార్యకర్తల్లో ఫుల్ జోష్ నింపారు. దీంతో రెట్టించిన ఉత్సాహంతో కార్యకర్తలు దూకుడుగా వ్యవహరిస్తూ పార్టీ గెలుపు కోసం శ్రమిస్తున్నారు.అయితే సిట్టింగ్ సీటును కాపాడుకోవడానికి బీజేపీ సైతం అదే స్థాయిలో దూసుకెళు ండటంతో ఆదిలాబాద్ గెలుపు హస్తానికి అంత సులువు కాదన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. అయితే మహిళా అభ్యర్థిని బరిలోకి దింపిన కాంగ్రెస్ పార్లమెంటు పరిధిలో పురుష ఓటర్ల కంటే 40వేల ఆధిక్యంలో ఉన్న మహిళా ఓటర్లనే గంప గుత్తగా తమ వైపు తిప్పుకుంటామని ధీమా వ్యక్తం చేస్తోంది. మరోవైపు కొత్తగా ఓటు హక్కును సాధించిన యువతను సైతం తమవైపు తిప్పుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంటులోని ఏడు నియోజకవర్గాలలో కలిపి 2.50 లక్షల ఓట్లను మాత్రమే సాధించిన కాంగ్రెస్ మహిళా ఓటర్లు, యువ ఓటర్లు, పథకాలతో కలిసి వచ్చిన నూతన ఓటర్లు, ఆపరేషన్ ఆకర్ష్ తో కొత్తగా చేరిన కీలక నేతల బలం బలగంతో కలిపి మరో రెండు లక్షల ఓట్లు తమకు అదనంగా కలిసి వస్తాయని భావిస్తోంది కాంగ్రెస్.అయితే అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు పూర్తికాకపోవడం గ్రామీణ ప్రాంతాల్లో కాస్త వ్యతిరేకతను మూటగట్టుకున్నట్టుగా కనిపిస్తున్నప్పటికీ.. అగ్రనేతల ప్రచారం.. ప్రత్యర్థి పార్టీల బలహీనతలు తమకు బలంగా మారుతాయని భావిస్తోంది కాంగ్రెస్. గత పార్లమెంటు ఎన్నికలతో పోల్చితే పోలింగ్ శాతం పెరిగితే విజయం తమదే అన్న ధీమాను సైతం వ్యక్త పరుస్తోంది హస్తం పార్టీ.2019లో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో 14,88,353 ఓటర్లు ఉండగా తాజాగా ఆ ఓట్ల సంఖ్య 16,50,175కి చేరడంతో పెరిగిన 1.12లక్షలకు పైగా ఓటర్లు గంపగుత్తగా మా వైపే నిలుస్తారని కాంగ్రెస్ భావిస్తోంది. అయితే సొంత పార్టీలోనే అసమ్మతి నివురుగప్పిన నిప్పులా ఉండటం చాపకింద నీరులా ఇన్‌ఛార్జీల వ్యవహారం పార్టీకి నష్టం చేస్తుండటం.. ఆపరేషన్ ఆకర్ష్ తో కలిసి వస్తుందనుకున్న బీఆర్ఎస్ ఓటు బ్యాంకు సైలెంట్ గా మారడంతో ఓట్ల పండగలో తీర్పు ఎంత వైలెంట్ గా ఉంటుందోనన్న ఆందోళన కాంగ్రెస్ ను వెంటాడుతోంది.కాంగ్రెస్ పరిస్థితి అలా ఉంటే సిట్టింగ్ సీటును కాపాడుకునే సమరంలో బీజేపీ పరిస్థితి మరోలా ఉంది. మోదీ హవాతో పక్కా గెలుస్తామని క్యాడర్ చెపుతున్నా.. అభ్యర్థిమార్పు కాస్త సంక్లిష్ట పరిస్థితుల్లో పడేసిందని తెలుస్తోంది. పార్లమెంట్ పరిదిలో కార్యకర్తల బలానికి లోటు లేకున్నా.. అసెంబ్లీ ఎనదనికల్లో ప్రజలిచ్చిన తీర్పుతో.. బలం.. బలగం పెరిగినా.. నేతల మధ్య సమన్వయ లోపం బీజేపీకి ఈ పార్లమెంట్ పరిధిలో నష్టం చేసే ఛాన్స్ ఉందన్న టాక్ నడుస్తోంది. బీజేపీ గెలుపును పక్కా చేసేందుకు కొమురంభీం జిల్లా సిర్పూర్ నియోజక వర్గంలో అమిత్ షా పర్యటించడంతో పార్టీలో మార్పు వచ్చిందని తెలుస్తోంది.తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు ఇచ్చిన తీర్పుతో ఏకంగా నాలుగు అసెంబ్లీ స్థానాలు కైవసం చేసుకుని 4.48లక్షలకు పైగా ఓటు బ్యాంకును సొంతం చేసుకున్న కాషాయ పార్టీ అదే జోష్ ను ఈ పార్లమెంట్ ఎన్నికల్లోను కంటిన్యూ చేయాలని చూస్తోంది. ఈ పార్లమెంట్ లో యువ ఓటర్లు కలిసి వస్తే విజయం సునాయాసమే అనే ధీమాతో ముందుకెళ్తుంది కాషాయ పార్టీ. ఆదిలాబాద్ పార్లమెంటులో 18 నుంచి 29ఏండ్ల ఓటర్లు 4,31,357 మంది ఉండగా.. మోదీ ఛరిష్మా కలిసి వచ్చి ఈ యువ ఓట్లలలో 80 శాతం తమకే పడుతుందని ధీమా వ్యక్తం చేస్తోంది బీజేపీ. నూతన ఓటర్లు, యువ ఓటర్లు, సంప్రదాయ ఓటర్లతో కలిపి ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలో 5 లక్షల ఓట్లను సంపాదించుకుని లక్ష మెజార్టీతో విజయం సాదిస్తామనే ధీమా వ్యక్తం చేస్తోంది బీజేపీ.బీజేపీ అభ్యర్థి గోడెం నగేష్ దూకుడుగా వ్యవహరించకపోవడం, అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన నలుగురు ఎమ్మెల్యేలు.. ఎవరికివారే యమునా తీరే అన్నట్లు సాగుతుండటంతో.. కార్యకర్తల్లో ఆ స్థాయిలో జోష్ కనిపించడం లేదు. చార్ సౌ పార్.. ఫిర్ ఏక్బార్ మోడీ సర్కార్ అన్న ఒకే ఒక్క నినాదం కాషాయ క్యాడర్ ను లీడర్ ను ముందుకు నడిపిస్తుండగా.. గెలుపు బాధ్యతలు భుజానికెత్తుకున్న నేతలు మాత్రం సమన్వయంతో సాగకపోవడం కాషాయానికి గడ్డుకాలాన్ని తెచ్చిపెడుతోంది.

నిన్న మొన్నటి వరకు ఫుల్ జోష్ లో కనిపించిన కారు పార్టీ అధికారం కోల్పోవడంతో ఆదిలాబాద్ పార్లమెంటు పరిదిలో ఆ స్థాయి జోష్ తో ప్రజల్లోకి వెళ్లలేకపోతోంది. కీలక నేతలు సైతం ఆదిలాబాద్ పార్లమెంటును లైట్ తీసుకోవడంతో బాధ్యతలన్నీ తన భుజానెత్తుకున్న మాజీ మంత్రి జోగు రామన్న అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లతో కార్యకర్తల అండదండలతో వంద రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వచ్చిన వ్యతిరేకతతో గెలిచి నిలుస్తామన్న ధీమాను వ్యక్తం చేస్తున్నారు. నిర్మల్‌లో కేటీఆర్ రోడ్ షోతో కార్యకర్తల్లో జోష్ నిండినా.. ఆపరేషన్ ఆకర్ష్ తో కోల్పోయిన క్యాడరు, లీడర్లను వారి వెంట వెళ్లిపోయిన ఓటు బ్యాంకును తిరిగి సంపాదించుకోవడం కారు పార్టీకి ఆదిలాబాద్ పార్లమెంట్ పరిదిలో అంత సులువు కాదన్న భావనకు వచ్చేసింది బీఆర్ఎస్.

ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలో కేవలం రెండు నియోజకవర్గాలను మాత్రమే గెలుచుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు చరిష్మా పైనే ఆధారపడి ముందుకు సాగుతోంది. ఆదివాసీల్లో అభ్యర్థికి మంచి పేరు ఉండటం గెలిచిన బోథ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేలు ఇద్దరు ఆపరేషన్ ఆకర్ష్ కు లొంగకుండా పార్టీ గెలుపు కోసం శ్రమిస్తుండటం కలిసి వచ్చే అంశం. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో 4.65లక్షల ఓటు బ్యాంకును సంపాదించుకున్న బీఆర్ఎస్ కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ ఇప్పటికే 1.50లక్షలకు పైగా ఓటు బ్యాంకును కోల్పోగా కొత్త ఓటర్లుగా తమ ఓటు హక్కును వినియోగించుకోబోయే 4లక్షలకు పైగా ఓటర్లలో కేవలం 20శాతం కూడా ఓటు బ్యాంకును రాబట్టుకోలేని పరిస్థితిలో బీఆర్ఎస్ ఉండటంతో ఆదిలాబాద్ సీటు గెలుపు కారు పార్టీకి గగనమే అన్న సంకేతాలు కనిపిస్తున్నాయి.ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలో త్రిముఖ పోరు కనిపిస్తున్నప్పటికీ కాంగ్రెస్‌లో లో సమన్వయ లోపం, బీఆర్ఎస్ లో నాయకత్వ లోపం గెలుపుపై ఆశలను సన్నగిల్లేలా చేస్తున్నాయి. ఇటు బీజేపీలోనూ అసమ్మతి చాపకింద నీరులా కనిపిస్తున్నప్పటికీ నేతల కంటే దూకుడుగా కార్యకర్తలు గెలుపు బాధ్యతలు భుజానికెత్తుకోవడం కలిసి వచ్చే అంశం. బీజేపీకి అండదండగా నిలుస్తూ మూడోసారి మోదీ సర్కార్ రావాలన్న దృఢనమ్మకంతో హిందూ సంఘాలు బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం చేస్తుండటం కూడా ఆ పార్టీ అవకాశాలను మెరుగుపరుస్తున్నట్లుగా కనిపిస్తోంది.ఇటు బీజేపీలో పన్నా కమిటీలతో కమల దళం గల్లీ గల్లీలో ప్రచారం చేస్తుండటం.. బూత్ కమిటీలు, శక్తి కేంద్రాలు క్రియాశీలక పాత్ర పోషిస్తుండటం మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఈ కమిటీలు ఇంటింటికి చేరుస్తుండటం గ్రామాల్లో యువకులు, మేధావులు, రైతులు, మహిళలతో ప్రత్యేక ఆత్మీయ సమ్మేళనాలు కొనసాగుతుండటం బీజేపీకి కలిసి వచ్చే అంశంగా మారుతోంది. కాంగ్రెస్ సైతం అదే స్థాయిలో ప్రచారాన్ని కొనసాగిస్తున్నప్పటికీ బాధ్యతలన్నీ ఇన్‌చార్జి మంత్రి సీతక్క, టీపీసీసీ జనరల్ సెక్రటరీ సత్తు మల్లేష్ మాత్రమే మోయాల్సి వస్తుండటంతో ఎదురీదాల్సి వస్తోంది. ఆపరేషన్ ఆకర్ష్ తో బీఆర్ఎస్ నుండి గంప గుత్తగా పార్టీలో చేరిన కారు పార్టీ నేతలు ఇంకా కాంగ్రెస్ నాయకులమన్న ధీమాలోకి రాకపోవడం.. ఘర్ వాపసీని కొత్త నేతలు అడ్డుకోవడం కూడా మైనస్ గా ఉంది. వంద రోజుల పాలనలో మహిళలు, యువత, పట్టణ ప్రాంత ఓటర్లు హస్తం కు మరొక్క అవకాశం ఇస్తే పోలా.. అన్న తీరును కనబరుస్తుండటం కాంగ్రెస్‌కు ఈ పార్లమెంట్ పరిదిలో కలిసి వచ్చే అంశం. అటు గ్రామీణ ప్రాంతాల్లోను బీజేపీకి జై కొడుతున్న ఓటర్ల సంఖ్య పెరుగుతుండటం కాషాయ దళానికి కలిసొచ్చే అంశం. ఇద్దరి ప్రభావంతో బీఆర్ఎస్ అసెంబ్లీ ఎన్నికల్లో సంపాదించుకున్న ఓటుబ్యాంక్ ను కాపాడుకోవడం కష్టమే. చూడాలి మరీ.. ఈ లెక్కలన్నీ పక్కాగా అమలైతే.. గెలుపు మంత్రం తూచ తప్పకుండా సాగితే మార్పు తథ్యం. లేదంటే పాత నేతకే పట్టం.

### రాష్ట్రపతి చేతుల మీదుగా
## పద్మవిభూషణ్ అందుకున్న మెగాస్టార్ చిరంజీవి




**టీ మీడియా, మే 9, న్యూఢిల్లీ:** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా మెగాస్టార్ చిరంజీవి పద్మవిభూషణ్ పురస్కారం అందుకున్నాడు. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో గురువారం 'పద్మ' పురస్కారాల ప్రదానోత్సవం జరుగుతుంది. ఈ ఏడాది జనవరి 25న ప్రకటించిన 132 మందికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేస్తున్నారు. అయితే నేడు పద్మ విభూషణ్ అవార్డులను ప్రదానం చేయగా.. టాలీవుడ్ అగ్ర నటుడు మెగాస్టార్ చిరంజీవి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మవిభూషణ్ పురస్కారాన్ని అందుకున్నాడు. సినీ రంగంలో చిరంజీవి చేసిన సేవలకుగాను ఈ అవార్డు వరించింది. ఇక ఈ వేడుకలో చిరంజీవి భార్య సురేఖతో పాటు తనయుడు రామ్ చరణ్, కోడలు ఉపసాన ఉన్నారు.

### పెద్ద పార్లమెంటులో సింగరేణి కార్మిక కుటుంబాల ఓట్లే కీలకం
## ప్రచార జోరు పెంచిన ప్రధాన పార్టీలు
# కాంగ్రెస్ క్లీన్ స్వీప్..
### పరిచయాలే గెలిపిస్తాయని కొప్పుల ఆశలు
### కలిసి వస్తుందని బీజేపీ అభ్యర్థి ధీమా

**టి మీడియా,మే9, పెద్దపల్లి బ్యూరో:**



సింగరేణి ఓట్ల పై దృష్టి పెట్టిన ప్రధాన పార్టీ అభ్యర్థులు పోటా పోటీగా ప్రచారం చేస్తున్నారు. పేరుకు తగ్గట్టే అది పెద్ద పార్లమెంటు నియోజకవర్గం. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లతో విస్తరించి ఉన్న ఆ నియోజకవర్గంలో సింగరేణి కార్మిక కుటుంబాల ఓట్లే కీలకం. దీంతో కార్మిక కుటుంబాలను ప్రసన్నం చేసుకునేందుకు ఎవరి ప్రయత్నాలను వారు ముమ్మరంగా చేస్తున్నారు. కార్మికుల ప్రధాన సమస్యలను ఎజెండాలుగా ఎంచుకొని ముందుకు సాగుతున్నారు. ఉత్తర తెలంగాణలోని పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో పోరు రసవత్తరంగా కొనసాగుతోంది. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా కాకా వెంకటస్వామి మనుమడు, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తనయుడు గడ్డం వంశీకృష్ణ పోటీ చేస్తుండగా, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. బిజెపి అభ్యర్థిగా గోమాస. శ్రీనివాస్ రెండవసారి తన అదృష్టాన్ని పరిక్షించుకోబోతున్నారు. ఈ ముగ్గురు ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రజల్లో పట్టు కోసం ప్రయత్నాలు కొనసాగిస్తూనే, కీలకమైన సింగరేణి కార్మిక కుటుంబాల మద్దతుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఐదు అసెంబ్లీ సెగ్మెంట్ల ఫలితాలను ప్రభావితం చేసే సత్తా సింగరేణి కార్మికులది.ఈ విషయాన్ని గ్రహించిన ప్రధాన పార్టీలు, సింగరేణి కార్మిక కుటుంబాల మద్దతు కోసం విస్తృతంగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లను గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసుకోవడం, ఇటీవల జరిగిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ అనుబంధ ఐ ఎన్ టి యు సి సత్తా చాటుకోవడం, సింగరేణి గుర్తింపు సంఘమైన ఎ ఐ టి యు సి మద్దతును ప్రకటించడం, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి అనుకూలించే అంశాలుగా ఆ పార్టీ అంచనా వేస్తోంది. మరోవైపు బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొప్పుల ఈశ్వర్ స్వతహాగా సింగరేణి కార్మికుడు కావడం, కార్మిక ఉద్యమాలలో చురుకైన పాత్రను పోషించిన చరిత్రను కలిగి ఉండడం ఆయన గెలుపుకు లాభించే అంశాలుగా బీఆర్ఎస్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇంకోవైపు బిజెపి అభ్యర్థి కూడా సింగరేణి కార్మిక కుటుంబాల మద్దతు కోసం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పెద్దపల్లి పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో గెలుపు ఓటములను నిర్ధారించే సింగరేణి కార్మికులు అంతిమంగా ఎటువైపు మొగ్గుచూపుతారనే అంశం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

#### కాంగ్రెస్ క్లీన్ స్వీప్..

పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలో విస్తరించిన ఈ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో రామగుండం, పెద్దపల్లి, మంథని, మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి, ధర్మపురి నియెజకవర్గాలు ఉన్నాయి. మొత్తం 15 లక్షల 94 వేల 392 ఓట్లు ఉన్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఈ ఏడు నియోజకవర్గాలను క్లీన్‌స్వీప్ చేసింది. మొత్తం ఏడు చోట్ల కలిపి 6 లక్షల 82 వేల 33 ఓట్లు సాధించి తిరుగులేని ఆధిపత్యం చెలాయించింది కాంగ్రెస్. ఇక ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీకి 3 లక్షల 36 వేల 374 ఓట్లు వచ్చాయి. గతంలో బీఆర్ఎస్ హవా కొనసాగిన పెద్దపల్లిలో గత అసెంబ్లీ ఎన్నికల్లో పూర్తి రివర్స్ ఫలితాలు వచ్చాయి. ఇక ఈ సారి ఎలాగైనా గెలవాలని కలలు కంటున్న బీజేపీకి ఏడు నియోజకవర్గాల పరిధిలో కేవలం 79 వేల 418 ఓట్లు మాత్రమే వచ్చాయి.

#### పరిచయాలే గెలిపిస్తాయని ధీమా..

సింగరేణి మాజీ కార్మికుడైన కొప్పులకు ఈ ప్రాంతంలో బంధువర్గం, స్నేహితులు, అనుచరులు ఎక్కువగా ఉన్నారు. గతంలో ఆయన ప్రాతినిధ్యం వహించిన మేడారం నియెజకవర్గంలో భాగమైన రామగుండం, ధర్మపురి నియెజకవర్గాల్లో కొప్పులకు అభిమానులు ఉన్నారు. దీనికి తోడు కోల్‌బెల్ట్ వ్యాప్తంగా కారు పార్టీ ఓటు బ్యాంక్ బలంగా ఉండటంతో గెలుపుపై ఆశలు పెట్టుకుంటోంది బీఆర్ఎస్. తనకున్న విస్తృత పరిచయాలే ఎంపీగా గెలిపిస్తాయని కొప్పుల ఈశ్వర్ కూడా నమ్మకంగా చెబుతున్నారు కలిసి వస్తుందని బీజేపీ అభ్యర్థి ధీమా.

నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలతోపాటు సింగరేణిలో ఆ పార్టీ అనుబంధ యూనియన్ గుర్తింపు సంఘంగా గెలవడం కాంగ్రెస్‌కు అడ్వాంటేజ్‌గా చెబుతున్నారు. ఇదే సమయంలో బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న గోమాస శ్రీనివాస్ చీల్చే ఓట్లు కూడా కీలకంగా మారాయి. 1993 నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన గోమాస శ్రీనివాస్.. 2009లో కాంగ్రెస్ టిక్కెట్ ఆశించి భంగపడ్డారు. అప్పట్లో టీఆర్ఎస్ పార్టీలో చేరి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో 2 లక్షల 64 వేల 731 ఓట్లు సాధించారు. ఆ ఎన్నికల్లో ఓటమి తర్వాత టీఆర్ఎస్ నుంచి తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చిన గోమాస.. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూరు టికెట్ దక్కలేదనే అసంతృప్తితో ఈ మధ్యే బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్లమెంట్ పరిధిలో మొత్తం 15 లక్షల 94 వేల 392 ఓట్లు ఉండగా%% అందులో గోమాస శ్రీనివాస్ సామాజికవర్గమైన మహవీర్ నేతకాని సామాజికవర్గానికి 2 లక్షల 25 వేల 875 ఓట్లు ఉన్నాయి. ఈ ఓటు బ్యాంకు తనకు కలిసి వస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు గోమాస శ్రీనివాస్.

### కాంగ్రెస్ పార్టీ నాయకుల
# పైశాచిక ఆనందం

### ఉపాధి కూలీ టీ-షర్ట్ విప్పి అర్ధనగ్నంగా నిలబెట్టారు.

**టి మీడియా,మే9, జయశంకర్ భూపాలపల్లి :**



జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నాయకుల పైశాచిక ఆనందం జనంలో చర్చగా మారింది. ప్రచారంలో భాగంగా ఉపాధిహామి కూలీల వద్దకు వెళ్లిన కొందరు కాంగ్రెస్ స్థానిక నేతలు మండుటెండలో ఓ కూలీ షర్ట్ విప్పించి అర్ధ నగ్నంగా నిలబెట్టారు. ఆ కూలీ ధరించిన టీ షర్ట్ బీఆర్ఎస్ పార్టీకి చెందిన టీ షర్టు కావడమే కారణంగా తెలుస్తోంది. బలవంతంగా కాంగ్రెస్ స్థానిక నేతలు అతని టీ షర్ట్ విప్పించి పారేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్గా మారింది. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ఒడిపిలవంచ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఉపాధి పనులు జరిగే ప్రాంతానికి వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్న క్రమంలో ఓ కూలీ బీఆర్ఎస్?కు చెందిన గులాబీ రంగు టీషర్టును ధరించి కనిపించాడు.దీంతో కాంగ్రెస్ నాయకులు అందరి ముందే.. అతని టీషర్టును విప్పించి విసిరేశారు. అతనికి ఎలాంటి దుస్తులు ఏర్పాటు చేయకుండా మండుటెండలో ఆ కూలీ ఒంటిపై దుస్తులు లేక కొంతసేపు ఇబ్బంది పడ్డాడు. కాంగ్రెస్ నాయకులు ప్రచారం ముగించి వెళ్లిన అనంతరం సదరు కూలీ అదే టీషర్టును ధరించి పనిలో నిమగ్నమయ్యాడు. ఈ సంఘటనను తోటి కూలీలు తమ ఫోన్లలో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో మండలంలో చర్చనీయాంశంగా మారింది.

# కాయ్ .. రాజా కాయ్



- అభ్యర్థి గెలుపు, మెజార్టీలపై పందేల హెూరు

**టి మీడియా,మే9, ఏలూరు ప్రతినిధి (ఎ పి) :**

ఎన్నికల పోలింగ్ దగ్గర పడుతున్న కొద్ది బెట్టింగుల జోరు ఊపందుకుంది. ప్రతి నియోజకవర్గంలోనూ అభ్యర్థి గెలుపు, మెజార్టీలపై పందేలు హెూరెత్తుతున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. అక్కడా, ఇక్కడా అనే తేడా లేకుండా ప్రతి నియోజకవర్గంలోనూ పందేలు సాగుతున్నాయి. దెందులూరు, ఉండి వంటి నియోజకవర్గాల్లో రాజకీయం రసవత్తరంగా మారడంతో పందెంరాయుళ్లు అదేస్థాయిలో రెచ్చిపోతున్నారు. నరసాపురంలో ఫలానా పార్టీ అభ్యర్థి గెలుస్తారంటూ కోసు పందేలు సైతం వేస్తున్నట్లు తెలుస్తోంది. అత్యధిక పందేలు అభ్యర్థి గెలుపుపై సాగుతుండగా, అభ్యర్థి గెలుస్తాడన్న ధీమా ఉన్న నియోజకవర్గాల్లో మెజార్టీపైనా పందేలు కాస్తున్నారు. ఎన్నికల పందేల్లో విచిత్రమైన పరిస్థితి కన్పిస్తోంది. వైసిపి అభిమానులు టిడిపి గెలుస్తుందని పందేలు కాస్తుండగా, టిడిపి అభిమానులు వైసిపి అభ్యర్థులు గెలుస్తారని పందేలు కాస్తుండటం గమనార్హం. ముఖ్యంగా వివిధ సంస్థలు విడుదల చేస్తున్న సర్వేల ఆధారంగా పందేల జోరు ఊపందుకుంటుంది. ఆచంట నియోజకవర్గంలో టిడిపి నుంచి పితాని సత్యనారాయణ, వైసిపి నుంచి చెరుకువాడ రంగనాథరాజు నువ్వానేనా అన్నట్లు పోటీ పడుతున్నారు. ఆర్థికంగా బలమైన అభ్యర్థులు కావడంతో గెలుపుపై ఇరువురు ధీమాగా ఉన్నారు. దీంతో ఇక్కడ అభ్యర్థి గెలుపుపై ఎక్కువగా పందేలు సాగుతున్నాయి. పాలకొల్లులో గడిచిన రెండుసార్లుగా టిడిపి తరపున నిమ్మల రామానాయుడు గెలిచారు. ఈసారి వైసిపి నుంచి గుడాల గోపి, టిడిపి నుంచి రామానాయుడు తలపడుతున్నారు. నిమ్మల మూడోసారి గెలుస్తాడని కొంతమంది పందేలు కాస్తుండగా, ఈసారి గోపీ గెలుస్తారని మరికొంత మంది పందేలు కాస్తున్నారు. ఇక్కడ అభ్యర్థుల మెజార్టీపై పందేలు సాగుతున్నాయి. నరసాపురంలోనూ అభ్యర్థి గెలుపు, మెజార్టీపైనా పందేలు జోరుగా సాగుతున్నాయి. భీమవరంలో వైసిపి నుంచి గ్రంధి శ్రీనివాస్, జనసేన నుంచి పులపర్తి రామాంజనేయులు తలపడుతున్నారు. ఈ స్థానంలో పందేలు పెద్దఎత్తున సాగుతున్నాయి. అభ్యర్థి గెలుపుకంటే మెజార్టీపైనే ఎక్కువ బెట్టింగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఉండిలో టిడిపి నుంచి పోటీ చేస్తున్న రఘురామకృష్ణంరాజు గెలుపోటములపై ఎక్కువగా పందేలు నడుస్తున్నాయి. తాడేపల్లిగూడెం, తణుకులోనూ అభ్యర్థి గెలుపుపై ఎక్కువగా బెట్టింగులు కడుతున్నారు. ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గంలో టిడిపి నుంచి చింతమనేని ప్రభాకర్, వైసిపి నుంచి అబ్బాయిచౌదరి మధ్య పోటీ నువ్వా నేనా అన్నట్లు ఉంది. దీంతో ఇక్కడ పందేలు మరింత ఎక్కువగా సాగుతున్నాయి. విజేత ఎవరైనా అతి తక్కువ మెజార్టీనే వస్తుందని లెక్కలు కడుతూ మెజార్టీపైనే పందేలు సాగుతున్నాయి. ఏలూరులో అభ్యర్థి గెలుపుపై ఎక్కువగా పందేలు సాగుతున్నాయి. నూజివీడు, చింతలపూడిలో అభ్యర్థి గెలుపుపై పందేలు సాగుతుండగా, కైకలూరులో అభ్యర్థి మెజార్టీపై పందేలు ఎక్కువగా సాగుతున్నాయి. పోలవరంలో మాత్రం పందేల జోరు కొంత తక్కువగా ఉంది. ఎంపీ స్థానాలపైనా పందేలు పడుతున్నారు. ఏలూరు, నరసాపురం ఎంపీ స్థానాలు ఏ పార్టీ గెలుచుకుంటుందనే దానిపై పందేలు సాగుతున్నాయి. ప్రతి నియోజకవర్గంలోనూ రూ.20 కోట్లకుపైగా పందేలు ఉంటాయని అంచనా. కొంతమంది ఒక్కటిగా కలిసి తలోకొంత వేసుకుని పందేలు కడుతున్నారు. మధ్యవర్తుల ద్వారా ఈ పందేలు సాగుతున్నాయి. పందేలు కాసేవారు మధ్యవర్తిని కలిసి చెబితే అతను వేరొకరిని పందేనికి ఏర్పాటు చేస్తున్న పరిస్థితులు సాగుతున్నాయి. ఈ పందేల విషయం బయటికి పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎవరికి ఆనందం.. ఎవరికి బాధో జూన్ నాలుగో తేదీన తెలియనుంది.



## తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ..

**టి మీడియా,మే9,తిరుమల:**

ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమలలో భక్తుల రద్దీ తక్కువగా ఉంది. శ్రీవారి సర్వదర్శనం కోసం కేవలం 4 కంపార్ట్ మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. టోకెన్ లేకుండా వచ్చిన భక్తులకు స్వామి వారి దర్శనానికి నాలుగు గంటల సమయం పడుతోంది. రూ.300 స్పెషల్ దర్శన్ టికెట్లు కొనుగోలు చేసిన భక్తులకు రెండు గంటల్లో దర్శనం పూర్తవుతోంది. తిరుమల శ్రీవారిని నిన్న 64,766 మంది దర్శించుకున్నారు. 24,158 మంది తలనీలాల మొక్కు సమర్పించుకున్నారు. నిన్న బుధవారం ఒక్క రోజే స్వామివారికి హుండీ ద్వారా రూ.3.09 కోట్ల ఆదాయం వచ్చింది.




## ఎన్నికలు ముగిసిన వెంటనే కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మఇళ్లు

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన

**టి మీడియా,మే9,హైదరాబాద్ :**

ఇందిరమ్మ ఇళ్ల పథకంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. గురువారం మంత్రి సమక్షంలో పలువురు కాంగ్రెస్‌లో చేశారు. వారికి కండువా కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే అర్హులైన అందరికీ కొత్త రేషన్ కార్డులు జారీ అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు కూడా మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. అకాల వర్షం కారణంగా తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని.. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని చెప్పారు. తాము 11 మందిమి కలిసి క్రికెట్ టీమ్ మాదిరిగా కలిసిగట్టుగా పనిచేస్తున్నామని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో మొత్తం 13 స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. మూడు స్థానాల్లో బీజేపీ ప్రభావం ఉంటుందని అన్నారు. ఎమ్ఐఎమ్ ఒక స్థానం గెలుస్తుంది.. ఇక బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదని కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌లో చేరిన శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు తగిన గర్తింపు ఇస్తామని హామీ ఇచ్చారు. దేశంలో మళ్లీ బీజేపీ గెలిస్తే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడటం ఖాయమని అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికే వ్యవస్థలన్నీ బీజేపీ నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు.

## ఘనంగా ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవ వేడుకలు..

**టి మీడియా,మే9,సుల్తాన్ బజార్ (,హైదరాబాద్):**




ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవ వేడుకల్లో భాగంగా రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూన్నట్ పుట్టినరోజు వేడుకలు సోమజిగూడ రాష్ట్రపతి భవన్లోని సంస్కృతి భవన్ లో ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర చైర్మన్ అజయ్ మిశ్రా ఐఏఎస్ రిటైర్డ్ చైర్మన్ మరియ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆఫ్ గవర్నర్ శ్రీ బుర్ర వెంకటేశ్వర గౌడ్ జాయింట్ సెక్రెటరీ ఆఫ్ రాజ్భవన్ భవాని శంకర్, సెక్రటరీ రఘు ప్రసాద్ గౌడ్ వేదికనలంకరించి జ్యోతి ప్రజ్వలనం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ హైదరాబాద్ బ్రాంచ్ చైర్మన్ మామిడి భీమిరెడ్డి, సిపిఆర్ కన్వీనర్ డాక్టర్ విజయ భాస్కర్ గౌడ్, వైస్ చైర్మన్ విజయలక్ష్మి, క్యాంప్ కో కన్వీనర్ కల్పనా దత్త గౌడ్ ఎంసీ నెంబర్ జ్యోతి, స్వర్ణ రెడ్డి, డాక్టర్ కీర్తన, డాక్టర్ లక్ష్మి, ప్రసన్న,, లీలావతి, డా శ్రీ పూజ, డా. విష్ణు గౌడ్, పవన్, అభిషేక్, రాధా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులపై పర్యవేక్షణ కరువు

- కార్యాలయానికి పరిమితమైన వర్క్ ఇన్స్పెక్టర్లు..?

**టి మీడియా,మే9,అచ్చంపేట :**



గ్రామీణ ప్రాంతాలలో వలసలు నివారించడానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పనులను అచ్చంపేట మండలంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివిధ గ్రామాలలో ఉపాధి కూలీలు చేసిన పనులను అంచనా వేయవలసిన వర్క్ ఇనిస్పెక్టర్లు ఫీల్డ్ లోకి వెళ్లడం లేదని, కార్యాలయానికే పరిమితమేరని తెలుస్తుంది. అచ్చంపేట మండలంలో 11 మంది టెక్నికల్ అసిస్టెంట్లు ఉన్నారు. ఇందులోనే ఒకరు ఇన్చార్జి ఈసీ గా మరొకరు ఇంచార్జ్ ఏపీవోగా విధులు నిర్వహిస్తున్నారు. మిగతా టెక్నికల్ అసిస్టెంట్లు ఒక్కొక్కరు నాలుగు 4,5 గ్రామపంచాయతీలు బాధ్యతలు చూస్తున్నారు. 38 గ్రామపంచాయతీలు, మండల కేంద్రానికి 60 కిలోమీటర్ల దూరం వరకు గ్రామాలు విస్తరించి ఉన్నాయి. ప్రతిరోజు వర్క్ ఇన్స్పెక్టర్ తనకు కేటాయించిన గ్రామానికి వెళ్లి పనులను పరిశీలిస్తున్నట్లు ఫోటో తీసుకొని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రూపులో అప్లోడ్ చేయవలసి ఉంటుంది. కానీ గత 20 రోజులుగా ఒక్క టెక్నికల్ అసిస్టెంట్ కూడా ఫోటోలో అప్లోడ్ చేయడం లేదని తెలుస్తుంది. కొందరు టెక్నికల్ అసిస్టెంట్లు స్థానికంగా చాలా ఏళ్లుగా ఉంటున్నారు. రాజకీయంగా పలకబడి ఉండడంతో అధికారులు కూడా గట్టిగా పని చెప్పడానికి భయపడుతున్నారని తెలుస్తుంది. ఏపీడి పర్యవేక్షణ కూడా అంతంత మాత్రమే ఉందని చర్చ జరుగుతుంది. ఈ విషయంపై మండల అభివృద్ధి అధికారి బాలచందర్ సృజన్ నవ తెలంగాణ వివరణ కోరగా. కచ్చితంగా ఫీల్డ్ విజిట్ చేయాలని చెపుతున్నాను. ఎవరైతే ఫీల్డ్ మీదకు వెళ్ళని వారిని గుర్తించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తానని తెలిపారు.

## గోడ కూలి ఏడుగురు మృతి ఘటనలో ఆరుగురు అరెస్ట్

**టి మీడియా,మే9,హైదరాబాద్:**



నగర శివారు బాచుపల్లిలో గోడ కూలి ఏడుగురు మృతి చెందిన ఘటనలో అధికారులు చర్యలు చేపట్టారు. ఆరుగురిని అరెస్టు చేశారు. భవన నిర్మాణదారుడు అరవింద్‌రెడ్డి, సైట్ ఇంజినీర్ సతీష్, ప్రాజెక్టు మేనేజర్ ఫ్రాన్సిస్, గుత్తేదారు రాజేశ్, మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిని నేడు కోర్టులో హాజరు పరచనున్నారు. మరోవైపు ఈ ఘటనలో మృతి చెందిన ఏడుగురి మృతదేహాలకు శవపరీక్ష పూర్తి చేసిన అనంతరం వారి బంధువులకు అప్పగించారు.

## తమిళిసైపై ఈసీకి ఫిర్యాదు..

- కోడ్ ఉల్లంఘించారంటున్న బీఆర్ఎస్..

**టి మీడియా,మే9, సికింద్రాబాద్:**



అయోధ్య రామమందిర ప్రతిరూపాలను పంపిణీ చేశారు మాజీ తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్. ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళిని (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) ఉల్లంఘించడమేనని బీఆర్ఎస్ ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేసింది. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె మంత్రి కిషన్ రెడ్డి తరపున ప్రచారం చేస్తున్నారు. బీజేపీ స్టార్ క్యాంపెయినర్?గా కూడా కొనసాగుతున్నారు తమిళిసై. ఈ నేపథ్యంలోనే సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గపరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే కాలనీలో అయోధ్య రామమందిర రూపాలను సామాన్యులకు పంచిపెట్టారు. దీనినిపై బీఆర్ఎస్ స్పందించి ఉద్దేశపూర్వకంగానే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ను ఉల్లంఘించారని ఫిర్యాదు చేసింది. ఐపీసీ సెక్షన్ 188 ప్రకారం దీనికి ఎన్నికల ప్రవర్తనా నియమావళి వర్తిస్తుందని ఈసీకి పేర్కొంది. దీంతో పాటు మరో కీలక అంశాన్ని పొందుపరిచింది.

## చికాగోలో తెలంగాణ విద్యార్థి మిస్సింగ్

**టి మీడియా,మే9, ఢిల్లీ:**



చికాగోలో భారత విద్యార్థి అదశ్యం అయ్యాడు. మే 2 నుంచి తెలంగాణకు చెందిన విద్యార్థి చింత కింది రూపేశ్ చంద్ర మిస్సయినట్లు చికాగోలోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా తెలిపింది. అతడి ఆచూకి కోసం పోలీసులు ప్రవాస భారతీయులతో నిరంతరం చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించింది. రూపేశ్‌చికాగోలోని ఎన్ షెరిడాన్ రోడ్ 4300 బ్లాక్ నుంచి కనపడకుడా పోయినట్లు తెలిపారుకాగా తెలంగాణలోని హన్మకొండకు చెందిన రూపేశ్ విస్కాన్సిన్ లోని కాంకార్డియా యూనివర్శిటీలో మాస్టర్స్ చదువుతున్నాడు. రూపేశ్ మిస్సయిన విషయం తెలియడంతో అతని తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. తమ కొడుకు ఆచూకి కనుగొనాలంటూ భారత విదేశాంగా శాఖను కోరారు.

## బిజెపి నేత మైనర్ కుమారుడి ఓటు

**టి మీడియా,మే9,న్యూఢిల్లీ :**



లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి నేత తన మైనర్ కుమారుడితో కలిసి ఓటు వేసిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియోపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ఎన్నికల కమిషన్‌ను బిజెపి పిల్లల ఆటవస్తువుగా మార్చిందని ధ్వజమెత్తాయి. భోపాల్‌లోని బెరాసియా సెగ్మెంట్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. మంగళవారం లోక్‌సభ మూడో విడత పోలింగ్ సమయంలో బిజెపి పంచాయితీ నేత వినయ్ మెహర్, తన కుమారుడితో కలిసి పోలింగ్ బూత్‌కు వెళ్లారు. ఓటు వేయడం గురించి ఆ బాలుడు వివరిస్తున్న 14 సెకండ్ల నిడివి కలిగిన వీడియోను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. బాలుడు, అతని తండ్రి ఇవిఎంలో బిజెపి చిహ్నంపై ఓటువేస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఈ వీడియోపై కాంగ్రెస్ నేత కమల్‌నాథ్ మీడియా సలహాదారు పీయూష్ బబేల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "పోలింగ్ బూత్‌లోకి మొబైల్ ఫోన్‌ను ఎలా అనుమతించారు, తండ్రితో పాటు బాలుడిని బూత్‌లోకి ఎందుకు అనుమతించారు " అని ప్రశ్నించారు. ఎలక్షన్ కమిషన్‌ను బిజెపి పిల్లల ఆటవస్తువుగా మార్చిందని ధ్వజమెత్తారు. ఈ వీడియోపై జిల్లా కలెక్టర్ కౌశలేంద్ర విక్రమ్ సింగ్ విచారణకు ఆదేశించారు. పోలింగ్ బూత్‌లోని ప్రిసైడింగ్ అధికారి, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

## సీఎం జగన్ విదేశాల టూర్‌పై తీర్పు 14కు వాయిదా

**టి మీడియా,మే9,హైదరాబాద్ :**




విదేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని సీఎం జగన్ మోహన్ రెడ్డి నాంపల్లి సీబీఐ కోర్టులో పటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరిగింది. దీంతో సీబీఐ లాయర్లు అభ్యంతరం చెప్పారు. సీఎం జగన్ విదేశీ పర్యటనకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వొదని ధర్మాసనాన్ని కోరారు. గతంలో కూడా కోర్టు అనుమతి ఇచ్చిందని ఈ సందర్భంగా జగన్ తరపు లాయర్లు గుర్తు చేశారు. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు తీర్పును ఈ నెల 14కు వాయిదా వేసింది.

## కేజ్రీవాల్ బెయిల్‌ను వ్యతిరేకిస్తూ ఇడి అఫిడవిట్

**టి మీడియా,మే9,న్యూఢిల్లీ :**



ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) గురువారం అఫిడవిట్ దాఖలు చేసింది. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేసేందుకు వీలుగా కేజ్రీవాల్‌కి మధ్యంతర ఉపశమనం కల్పించడంపై సుప్రీంకోర్టు శుక్రవారం తీర్పు వెలువరించనున్న సంగతి తెలిసిందే. చట్టం అందరికీ సమానమని, ప్రచారం చేయడం ప్రాథమిక, రాజ్యాంగపరమైన, చట్టబద్ధమైన హక్కు కూడా కాదని ఇడి పిటిషన్‌లో పేర్కొంది. ఎన్నికల ప్రచారం కోసం రాజకీయ నేతలెవరికీ బెయిల్ మంజూరు చేయలేదని తెలిపింది. తమ అభ్యర్థుల కోసం కేజ్రీవాల్‌ను ప్రచారానికి అనుమతించడం తప్పుడు సంకేతాలనిస్తుందని పేర్కొంది. లిక్కర్ స్కామ్ కేసులో కేజ్రీవాల్‌ను ఇడి మార్చి 21న అరెస్ట్ చేసింది. ఇటీవల ఆయన కస్టడీని ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు మే 20 వరకు పొడిగించింది. దీంతో మరో 14 రోజులు కేజ్రీవాల్ జైల్లోనే ఉండాల్సి ఉంటుంది.

## మణిపూర్ హింసాకాండపై 11,000 అఫిడవిట్లు

**టి మీడియా,మే9, మణిపూర్:**



హింసాకాండపై ముగ్గురు సభ్యుల దర్యాప్తు కమిటీకి (సిఓఐ) 11,000 అఫిడవిట్లు వచ్చినట్లు సీనియర్ ప్రభుత్వ అధికారి గురువారం తెలిపారు. ఈ అఫిడవిట్లలో అధిక శాతం హింసాకాండలో ప్రభావితమైన బాధితుల నుండి వచ్చాయని అన్నారు. మరికొన్నింటిని కొండ, లోయ ప్రాంతాల్లోని పౌర సమాజ బృందాలు దాఖలు చేశాయని చెప్పారు. ఇప్పటి వరకు అందిన అన్ని అఫిడవిట్‌లను సిఓఐ పరిశీలించిందని, హింస ఇతర సంబంధిత సమస్యలకు సంబంధించిన ప్రశ్నలకు మణిపూర్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం నుండి త్వరలో స్పందన కోరనుందని ఆ అధికారి తెలిపారు. నివేదికను ఖరారు చేసే ముందు ప్రైవేట్ వ్యక్తులు, ప్రభుత్వ అధికారులతో సహా సాక్షులను కూడా విచారించాలని సిఓఐ భావిస్తోందని అన్నారు. స్టేట్‌మెంట్, ఆరోపణలు, ఫిర్యాదులు" అఫిడవిట్ల రూపంలో సమర్పించాల్సిందిగా ఈ కమిటీ గతేడాది నవంబర్‌లో ప్రజలకు సూచించింది. అఫిడవిట్లను నమోదు చేసేందుకు ప్రోత్సహించేలా సహాయక శిబిరాల్లో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు ఈ కమిషన్ నియమించింది. నోటరీలు, చట్టపరమైన అధికారులను నియమించిందని, ప్రజలు తమ ఫిర్యాదులను హెల్ప్‌డెస్క్ సిబ్బంది టైప్ చేస్తారని అన్నారు. ప్రజల నుండి ఎలాంటి రుసుము వసూలు చేయరని అన్నారు. గౌహతి హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి అజరు లంబా నేతృత్వంలో మాజీ ఐఎఎస్ అధికారి హిమాన్షు శేఖర్ దాస్, మాజీ ఐపిఎస్ అధికారి అలోక్ ప్రభాకర్‌లను దర్యాప్తు కమిటీగా కేంద్ర హెూంమంత్రిత్వ శాఖ గతేడాది జూన్‌లో నియమించిన సంగతి తెలిసిందే.

## విశ్వాస పరీక్ష కోరుతూ గవర్నర్‌కు లేఖ

**టి మీడియా,మే9,చండీగఢ్ :**



రాష్ట్ర అసెంబ్లీలో విశ్వాస పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేస్తూ హర్యానా మాజీ డిప్యూటీ సిఎం దుష్యంత్ చౌతాలా గురువారం గవర్నర్‌కు లేఖ రాశారు. ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు పాలక బిజెపి కూటమికి మద్దతు ఉపసంహరించుకున్న సంగతి తెలిసిందే. ముగ్గురు ఎమ్మెల్యేలు మద్దతు ఉపసంహరించుకోవడంతో నయాబ్ సింగ్ సైనీ ప్రభుత్వం మైనారిటీలో పడిందని, దీంతో ఆయన ప్రభుత్వం తక్షణమే అసెంబ్లీలో తన బలాన్ని నిరూపించుకోవాలని జననాయక్ జనతా పార్టీ (జెజెపి) నేత దుష్యంత్ చౌతాలా గవర్నర్ బండారు దత్తాత్రేయకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం తీసుకువస్తే .. దానికి మద్దతిస్తామని అన్నారు. విశ్వాస పరీక్షలో ప్రభుత్వం మెజారిటీ సాధించలేకపోతే రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని చౌతాలా పేర్కొన్నారు. 90 సీట్లు కలిగిన హర్యానా అసెంబ్లీలో ప్రస్తుతం 88 మంది సభ్యులు ఉన్నారు. మెజారిటీ మార్క్ 45 కాగా, బిజెపికి 40 మంది సభ్యులు మాత్రమే ఉన్నారు.

## గోవా మద్యం సీసాలు స్వాధీనం

**టి మీడియా,మే9,నందిగామ(ఎన్‌టిఆర్) :**



ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలతో పాటు.. దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భారీ ఎత్తున మద్యం, నగదు స్వాధీనం అవుతున్న విషయం తెలసిందే. ఓటర్లను ప్రభావితం చేసేందుకు అక్రమ రవాణా మద్యం తరలించినట్లు సమాచారం అందడంతో నందిగామ పట్టణ శివారు డివిఆర్ కాలనీ వద్ద గురువారంతెల్లవారుజామున అక్రమంగా రవాణా చేస్తున్న మూడు వేల గోవా మద్యం సీసాలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ లక్షల రూపాయల్లో ఉంటుందని సమాచారం. ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని ఆటోని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాపు చేసున్నటు పోలీసులు తెలిపారు.

## హజ్ యాత్రకు వెళ్తున్న ముస్లిం సోదరులకు సన్మానం

**టీ మీడియా, మే 9, వనపర్తి బ్యూరో :**



వనపర్తి పట్టణంలో హజ్ యాత్రకు వెళుతున్న ముస్లిం సోదరులను అలీం, అకీమ్, రాషీద్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి .చిన్నారెడ్డి మాట్లాడుతూ హజ్ యాత్ర అనేది ఎంతో పవిత్రమైనది. ఈ కార్యక్రమంలో నందిమల్ల యాదయ్య, ఖమ్మర్ మియా, బి కృష్ణ, కిరణ్ కుమార్, అక్తర్, అనీస్, సమద్, బాబా, రాజేశ్వర్ రెడ్డి,గడ్డం వినోద్,రవి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మోసాన్ని నిలదీస్తున్న తెలంగాణ ప్రజలు

- బీఅర్ఎస్ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్

**టీ మీడియా, మే 9, వనపర్తి బ్యూరో :**



కాంగ్రెస్ మేనిఫెస్టో ఉచిత బస్సు వట్టి మాటలు నీటి మూటలు .ఇస్తానన్నవి ఏవి ఇవ్వలేదు,కొత్తగా చెప్పడానికి అబద్ధాలు లేవు. కాంగ్రెస్ వాళ్లకు ఊర్లో తిరగడానికి మొఖాలు లేవు. ఎక్కడికి వెళ్లినా ప్రజలు నిలదీస్తున్నారు అని జిల్లా పార్టీ అధ్యక్షులు గట్టు యాదవ్ అన్నారు. రాజపేట పెద్ద తండా ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ సారి తప్పకుండా కారు గుర్తు కూడా ఓటు వేసి ప్రవీణ్ కుమార్ ని గెలిపిస్తామని కూలీలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాధవరెడ్డి,సీనియర్ నాయకులు సుదర్శన్ రెడ్డి, కురుమూర్తి యాదవ్, రఘు వర్ధన్ రెడ్డి, సంపత్, చిట్యాల రాము, జయరాం నాయక్, చందు రాజు తదితరులు పాల్గొన్నారు.



## అనారోగ్యంతో బాధపడుతున్న మిత్రునికి ఆర్థిక సహాయం

- అందించిన పూర్వ విద్యార్థుల బృందం

**టీ మీడీయా,మే 9, వనపర్తి బ్యూరో :**

పెబ్బేరు మున్సిపాలిటీ చెనిమిల్లకు చెందిన శంకర్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న తోటి పూర్వ విద్యార్థుల బృందం బుదవారం శంకర్ కుటుంబ సభ్యులకు తమకు తోచిన ఆర్థిక సహాయాన్ని అందించారు. శంకర్ పెబ్బేరు మున్సిపాలిటీ లో బిల్ కలెక్టర్ కార్మికునిగా విధులు నిర్వర్తిస్తున్నారు. కొన్ని నెలల కిందట నుండీ ఆరోగ్యం బాగలేకపోవడంతో మిత్రుడు మంచం పట్టిన్నట్లు తెలుసుకున్న పూర్వ తోటి రమాదేవి, విజయ లక్ష్మి , శ్రీ విద్య , మంజుల ఎల్. పద్మజ శోభారాణి,కవిత, వెంకటేశ్వర్ రెడ్డి, వెంకట్ రెడ్డి , నాగేశ్వర్ రెడ్డి, బాలరాజు, వీర బోజాచారి, శ్యాంసుందర్, చందన్ ,సోమేశ్వర్ ,మాధవ రెడ్డి, వెంకటేశ్వర్లు, గిరివర్ధన్ రెడ్డి (లాయర్ ) ,రవీందర్ (కండక్టర్ ), శివశంకర్ (పోలీసు) ,శరత్ శంకర్ (పోలీసు ), రాఘవేందర్ (పోలీసు) ,శ్రీశైలం ,సుల్తాన్, రాజశేఖర్, ఎల్ రామన్ గౌడ్, వెంకటేష్,వెంకట్ రెడ్డి (సవాయి గూడెం), వెంకట్ రెడ్డి, రంగాపూర్, శేషిరెడ్డి,గోవిందు, మాలతి, ఖాజా, (కంచిరావుపల్లి) వెంకటేష్ , కమ్మరి .విద్యార్థులు చేయి చేయి కలిపి కొంత డబ్బు జమ్మచేసి అందజేసినట్లు తెలిపారు. తొందరగా తమ మిత్రుడు శంకర్ ఆరోగ్యం కుదుపడుతుందని ఆశాబావ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమములో వీరబోజాచారి, నాగేశ్వర్ రెడ్డి, బాలరాజు, శ్యాంసుందర్, చందన్ కుమార్ రెడ్డి, మాధవ రెడ్డి, వెంకట్ రెడ్డి, వెంకటేష్, ఖాజా, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ బియ్యం అక్రమ రవాణా

- లబ్ధి పొందేదెవరు..?
- పరిశ్రమలు లేక పెరుగుతున్న నిరుద్యోగ యువత
- బడా వ్యాపారులను వదిలి చిన్నవారిపై జులుం

**టి మీడియా,మే9,సిర్పూర్(టి):**

పేదల కోసం ప్రభుత్వాలు పంపిణీ చేస్తున్న రాయితీ బియ్యం పక్కదారి పడుతోంది. కొందరు జీవనం కోసం వాటిని అమ్ముకుంటుంటే మరి కొందరు వారి అవసరాలను ఆసరాగా చేసుకోని అధిక ధరలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. వీటిని ఆరకట్టాల్సిన అధికారులు బడా వ్యాపారులను వదిలి చిన్నచితకగా జీవనం సాగించేందుకు విక్రయించే వారిపై దాడులు నిర్వహించి పట్టుకుంటున్నారు. బియ్యం అక్రమంగా విక్రయించడం నేరామైనప్పటికి కుటుంబ పోషణకు తప్పడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఉపాధి, ఉద్యోగం లేక యువకులు, ఇతరులు రేషన్ బియ్యాన్ని



పక్కన ఉన్న మహారాష్ట్రలో విక్రయిస్తున్నారు. భూములు లేక ఉపాధి కరువై ప్రభుత్వం పేద ప్రజలకు పంపిణీ చేసే బియ్యాన్ని మన రాష్ట్రానికి సరిహద్దు రాష్ట్రమైన మహారాష్ట్రకు ద్విచక్ర వాహనాలపై తీసుకెళ్లి వారి కుటుంబాలతో మధ్య స్థాయిలో జీవనం కొనసాగిస్తున్నారు.

### మహారాష్ట్రలో ప్రత్యేక దుకాణాలు

రాష్ట్రానికి ఆనుకొని ఉన్న మహారాష్ట్రలోని పోడ్సా గ్రామంలో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేయడానికి ప్రత్యేకంగా మహారాష్ట్ర వారు కొంతమంది దుకాణాలు ఏర్పాటు చేశారు. ఈ దుకాణాలకే మన రాష్ట్ర రేషన్ బియ్యం నిరుద్యోగులు తీసుకెళ్తుంటారు. వీరిని ఆసరాగా చేసుకొని రాజకీయ పలుకుబడి కలిగిన కొంతమంది వ్యక్తులు కూడా అమ్ముకుంటారు. ఈ రేషన్ బియ్యం గ్రామాల్లోని వినియోగదారుల నుండి ఇంటికి తీసుకోక రేషన్ డీలర్‌కే అమ్ముకుంటున్నారు. వీరి వద్దనే రేషన్ బియ్యం సేకరిస్తారు. బియ్యాన్ని తరలించే ద్విచక్ర వాహనాల నిరుద్యోగులు వీరి వద్ద కొనుగోలు చేస్తారు. పలుకుబడి కలిగిన వ్యక్తులు కూడా వీరి వద్దనే సేకరించి ఐచర్, బొలోరో వాహనాల్లో తీసుకెళ్లి పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారు.

### బియ్యం అక్రమ రవాణాకు కారణమేంటి..?

వీరందరు ఈ అక్రమ రవాణా దందాకు పాల్పడడానికి ప్రధాన కారణం పది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ పరిపాలనలో ప్రభుత్వ శాఖలో వివిధ స్థాయిల్లో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయకపోవడం. ఎంతోకొంత చదువుకున్న నిరుద్యోగులు ఉపాధి దొరకక, నియోజకవర్గంలో పరిశ్రమలు లేక నిరుద్యోగులు ఇలాంటి మార్గాలను ఎంచుకుంటున్నారనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. చేయడానికి పని లేక కుటుంబాన్ని పోషించడానికి ఇలా అక్రమ మార్గం పట్టినట్టు తెలుస్తోంది.

### అధికారుల నిఘా వైఫల్యం

రేషన్ బియ్యం అక్రమ రవాణ కొన్ని రోజుల నుండి కొనసాగుతున్నా నివారించడంలో సంబంధిత శాఖ అధికారులు విఫలమయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి నెల ప్రభుత్వం ప్రజలకు పంపిణీ చేసే రేషన్ దుకాణాల్లో ఎప్పటికప్పుడు నిల్వలను పంపిణీ చేయకపోవడం, ఎవరైన సామాన్యులు ఫిర్యాదు చేస్తే తప్పా అధికారుల్లో చలనం రాదు. ద్విచక్ర వాహనాలపై రేషన్ బియ్యాన్ని తీసుకెళ్లే నిరుద్యోగులను పట్టుకొని మామూళ్లు ఇస్తేనే వదిలేస్తారు లేకపోతే కేసులు పెట్టి వారి ప్రతాపం చూపిస్తారు. కానీ రాజకీయ పలుకుబడి కలిగిన వ్యక్తులపై మాత్రం సుముఖతగా ఉంటున్నారని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

### ప్రభుత్వం స్పందించాలి

రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం, నియోజకవర్గంలో ఉన్న నాయకులు ఈ ప్రాంతంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పించాలి. స్వయం ఉపాధి చేసుకొనే విధంగా నిరుద్యోగ యువతి, యువకులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని, లేకపోతే నియోజకవర్గంలో ఇప్పటివరకు రేషన్ బియ్యం అక్రమ రవాణ కాకుండా ఇతర మారక ద్రవ్యాలు అక్రమ రవాణాకు అడ్డాగా మారబోతుందనే భయం కూడా ఉంది. ప్రభుత్వం స్పందించి ఈ ప్రాంతంలో ఉన్న నిరుద్యోగులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

# చదువుకునే బలహీన వర్గాల విద్యార్థులకు రేకుల షెడ్డులా

- మహాత్మ జ్యోతిరావు పూలే వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాల సందర్శించిన అఖిలపక్ష ఐక్యవేదిక

**టీ మీడియా, మే 9, వనపర్తి బ్యూరో :**

వనపర్తి జిల్లా కేంద్రంలో పనిలేని ఆఫీసులకు పెద్ద పెద్ద బిల్డింగులు. చదువుకునే బలహీన వర్గాల విద్యార్థి, విద్యార్థినిలకు రేకుల షెడ్డులా? విద్యార్థినీల తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు గురువారం పెద్దగూడెం రోడ్ లోని డబల్ బెడ్ రూమ్ పక్కన ఒక కోళ్ల షెడ్డులో ఏర్పాటు చేసిన వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాలను పరిశీలించి అవాక్కైనా నాయకులు. వెంటనే అక్కడి నుండి తలలించి వనపర్తి లోని అనుకూలంగా భవనంలోకి తరలించాలని ,గత ప్రభుత్వం వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాలకు కేటాయించిన స్థలంలో వెంటనే నిర్మాణం చేయాలని, ప్రభుత్వం మారడంతో డబ్బులు వెనక్కి వెళ్లాయని తెలిసిందని, వాటిని వెంటనే ఎమ్మెల్యే , జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని వెనక్కి తెప్పి%శీ%చ్చి, టెండర్లు పూర్తి, చేసి భవనం కట్టించాలని అఖిలపక్ష ఐక్యవేదిక డిమాండ్ చేస్తున్నది.



ఈ సందర్భంగా ఐక్యవేదిక అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్, సిపిఐ జిల్లా నాయకులు గోపాలకృష్ణ, రమేష్, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ సభ్యులు గంధం నాగరాజు, టిడిపి రాష్ట్ర నాయకులు కొత్త గొల్ల శంకర్, నాయకులు శివకుమార్,విష్ణు, చంద్రశేఖర్, చిన్న కురుమయ్య, జయంతి, శాంతి తదితరులు మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం ఏర్పడిన వ్యవసాయ శాఖ కళాశాలను తాత్కాలికంగా భవనం దొరకక కోళ్ల షెడ్డులో నిర్మించారని, దానికి రెండు లక్షల కిరాయి చెల్లిస్తున్నారని అదే కిరాయి పెడితే వనపర్తి లో కొత్త భవనాలు లభిస్తాయని, వనపర్తి లోని పలు భవనాలు అద్దెకు ఉన్నాయని కొత్త బిల్డింగు కట్టే వరకు విద్యార్థినిలకు రక్షణ కల్పించాలని, వనపర్తి లో గత ప్రభుత్వంలో విడుదలైన నిధులను మళ్లీ తీసుకురావాలని ఎమ్మెల్యే ని కలెక్టర్ ని కోరడం జరుగుతుంది. నిధులు రాకపోయినా, ఈ పనులు ఆగిపోయినా తక్షణమే అఖిలపక్ష ఐక్యవేదిక పోరాటం చేస్తుందని, విద్యార్థులకు ఉపాధ్యాయులకు ఐక్యవేదిక సిపిఐ ప్రజా సంఘాలు మద్దతుగా ఉంటాయని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. అవసరమైతే ప్రిన్సిపల్ సెక్రెటరీ వ్యవసాయ శాఖ మంత్రి ని కూడా ఐక్యవేదిక సంప్రదిస్తుందని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు.

## కుప్పకూలిన స్టాక్ మార్కెట్...

# 7 లక్షల కోట్లకు పైగా సంపద ఆవిరి

**టీ మీడియా, మే 9, న్యూఢిల్లీ:** దేశీయ స్టాక్ మార్కెట్లు ఈరోజు భారీ నష్టాల్లో ముగిశాయి. ఈ ఉదయం స్వల్ప లాభాల్లో ప్రారంభమైన మార్కెట్లు వెంటనే నష్టాల్లోకి జారుకున్నాయి. అక్కడి నుంచి ట్రేడింగ్ చివరి వరకు మార్కెట్లు పతనమవుతూనే వచ్చాయి. అంతర్జాతీయంగా నెలకొన్న ప్రతికూలతలు మన మార్కెట్లపై ప్రభావం చూపాయి. ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గుచూపారు. ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 1,062 పాయింట్లు కోల్పోయి 72,404కి దిగజారింది. నిఫ్టీ 234 పాయింట్లు నష్టపోయి 22,068కి పడిపోయింది. ఒక్క రోజే మదుపరులు ఏడు లక్షలకు పైగా సంపదను నష్టపోయారు..బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్: టాటా మోటార్స్ (1.86%), మహీంద్రా అండ్ మహీంద్రా (1.48%), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (1.27%), ఇన్ఫోసిస్ (0.54%), హెచ్సీఎల్ టెక్నాలజీస్ (0.49%).




టాప్ లూజర్స్: ఎల్ అండ్ టీ (-5.56%), ఏసియన్ పెయింట్స్ (-4.51%), జేఎస్ డబ్ల్యూ స్టీల్ (-3.46%), ఐటీసీ (-3.27%), బజాజ్ ఫైనాన్స్ (-2.83%).

## కాంగ్రెస్‌లో చేరిన గాండ్ల సమ్మయ్య

**టీ మీడియా, మే 9, రామకృష్ణాపూర్:**

క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లో గత కొన్ని సంవత్సరాల నుండి బిఆర్ఎస్ పార్టీ పట్టణ ఇంచార్జిగా కొనసాగిన గాండ్ల సమ్మయ్య బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది.కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి నివాసంలో గాండ్ల సమ్మయ్యకు,ఆయన అనుచర వర్గానికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి,పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఓడ్నాల శ్రీనివాస్,పిన్నంటి రఘునాథరెడ్డి,అబ్దుల్ అజిజ్ తదితరులు పాల్గొన్నారు.





## కాంగ్రెస్‌కు అపూర్వ స్పందన

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల

**టీ మీడియా, మే 9, వనపర్తి బ్యూరో :**

గోపాల్ పేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుంద్రాతి గణేష్ గౌడ్ ఆధ్వర్యంలో అడుగడుగునా బ్రహ్మరథం పడుతున్నా ప్రజలు. డప్పు సప్పుల మధ్య ఊరేగింపుల్లో హొరుగా సాగిన ప్రచారం . ఎన్నికల ప్రచారంలో ప్రజల అభిమానం మరువలేనిది.కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అడుగడుగున బ్రహ్మరథం పడుతూ అపూర్వ స్పందన ఇవ్వడం మల్లు రవి గెలుపునకు సంకేతమని జిల్లెల చిన్నారెడ్డి పేర్కొన్నారు.

ప్రచారంలో ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు. రాష్ట్రంలో ప్రజా పాలన ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు చేసే సంక్షేమ పథకాలకు శ్రీకరం చుట్టిన మన్నారు.బడుగు బలహీన వర్గాలకు సమస్యలు, సంక్షేమాలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. దేశంలో మోడీ చేసింది ఏమీ లేదని అబద్దాల హామీలతో ప్రజలను మోసం చేశారని అన్నారు.పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించి పార్లమెంటుకు పంపించాలని ప్రజలను ఉద్దేశించి సందేశం ఇచ్చారు.దేశంలో రాహుల్ గాంధీ ప్రధాని అయితే భారతదేశం ప్రపంచ పటంలోనే టాప్ జాబితాలో చేరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సాకలపల్లి గ్రామ అధ్యక్షులు వెంకటయ్య యాదవ్, గోపాల్ పేట మండల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరహరి నవీన్ రెడ్డి, ఈశ్వరయ్య, కుమారస్వామి, విష్ణుమూర్తి, గోపాల్, వీరయ్య, ముష్టి శేఖర్, కాంగ్రెస్ సీనియర్ కార్యకర్తలు గోపాల్ పేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుంద్రాతి గణేష్ గౌడ్, ఉమ్మడి గోపాల్ పేట మాజీ జెడ్పిటిసి ఆర్ రాజేశ్వర్ రెడ్డి, ఉమ్మడి గోపాల్ పేట మాజీ ఎంపీపీ జానకిరామ్ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కొంకి వెంకటేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సుధాకర్రావు, మండల కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ జిల్లెల్ల ప్రవీణ్, ఫిషరీస్ చైర్మన్ నందిమల్ల యాదయ్య, వనపర్తి పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరే రాములు యాదవ్, వనపర్తి పట్టణ మాజీ అధ్యక్షులు కిరణ్ కుమార్,వనపర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటనారాయణ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి కృష్ణ, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు దివాకర్, ఎన్ఎస్యుఐ జిల్లా అధ్యక్షులు రోహిత్, చెన్నారములు, కోళ్ల వెంకటేష్, రాగి వేణు, పెద్దమందడి మండల అధ్యక్షులు పెంటన్న, అసెంబ్లీ సోషల్ మీడియా కో కోఆర్డినేటర్ గడ్డం వినోద్,మైనారిటీ యూత్ నాయకులు ఇర్ఫాన్, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్షయ్, ప్రధానకార్యదర్శి నరసింహ, దిలీప్ రాము, రవి, నవీన్, ప్రవీణ్ గోపాల్పేట్ సోషల్ మీడియా నాయకులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ అమ్ముతున్న యువకుడు అరెస్ట్

**టి మీడియా, మే 9, హైదరాబాద్ :**

పాతబస్తీ శాలిబండ ప్రాంతంలో డ్రగ్స్ కంట్రోల్, పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. చార్మినార్ బస్ స్టాండ్ పార్కింగ్లో డ్రగ్స్కు అలవాటు పడ్డ వారికి నిషేధిత టైడోల్ ట్యాబ్లెట్లు విక్రయిస్తున్న యాకుతురకు చెందిన హర్షద్ ఖాన్ని అరెస్ట్ చేశారు. అతడి వద్ద 100కి పైగా ట్యాబ్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ట్యాబ్లెట్లు వాడటం వలన మెదడుపై ప్రభావం చూపి మనిషి కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉందని తెలిపారు.



## శివకాశి బాణాసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు

**టి మీడియా,మే9,తమిళనాడు:**

రాష్ట్రంలోని టపాకాయల తయారీకి ప్రసిద్ధి చెందిన శివకాశిలో గురువారం భారీ పేలుడు సంభవించింది. వివరాల్లోకి వెళితే.. బాణ సంచా తయారీ కేంద్రంలో ముడి సరుకును లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు భారీ విస్ఫోటనం జరిగింది. ఈ ప్రమాదంలో పేలుడు ధాటికి మొత్తం ఏడుగురు స్పాట్‌లోనే ప్రాణాలు విడిచారు. అందులో ఐదుగురు మహిళలలే ఉన్నట్లుగా తెలుస్తోంది. గమనించి స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందజేయగా ఫైరింజన్లు అక్కడి వెళ్లి మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. అయితే, మంటలు అదుపు చేస్తున్నప్పటికీ కార్మాగారం లో మందుగుండు సామగ్రి ఎక్కువ ఉండటంతో మంట లు ఎగసిపడుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.



## కనివిని ఎరగని రీతిలో పదవికి వన్నె తీసుకొస్తా

- యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి శతర్ల భాస్కర్ నాయుడు

**టీ మీడియా, మే 9, వనపర్తి బ్యూరో :**

మహబూబ్ నగర్ పార్లమెంట్ కు యూత్ కాంగ్రెస్ స్టార్ కాంపెయినర్ గా యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి శతర్ల భాస్కర్ నాయుడుని నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షులు రధసారధి శివసేన రెడ్డి కి, జాతీయ అధ్యక్షులు బీవీ శ్రీనివాస్ కి, ఇంచార్జ్ సుర్భి కి, నేషనల్ మీడియా ప్యానేలిస్ట్ రాజ్ కుమార్ కీ శతర్ల భాస్కర్ నాయుడు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తరఫున నాకు వచ్చేన ఏ పదవి బాధ్యత అయిన సరే కండ్లకు హద్దుకొని కనివిని ఎరగని రీతిలో ఆ పదవికి వన్నె తీసుకొస్తా అన్నారు.



## విద్యార్థిని సన్మానం చేసిన డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి

**టీ మీడియా, మే 9, వనపర్తి బ్యూరో :**

పదవ తరగతి ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన వనపర్తి గవర్నమెంట్ స్కూల చదువుతున్న విద్యార్థినీ ఇంటర్మీడియట్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని సన్మానం చేసిన ఏఐపిసి స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి. వనపర్తి గవర్నమెంట్ స్కూల్ లో పదవ తరగతి ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన వనపర్తి గవర్నమెంట్ స్కూల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థిని ఇంటర్మీడియట్ విద్యార్థిని. ఏఐపిసి స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల్ల ఆదిత్య రెడ్డి వనపర్తి లో తన నివాసంలో శాలువాతో సన్మానం చేయడం జరిగింది. ఆదిత్య రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని చెప్పడం. జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు వనపర్తి మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# వేరే చోట కేటాయించాకే తొలగించాలి

**టీ మీడియా, మే9, గోదావరిఖని ప్రతినిధి:**

వేరే చోట షాపులను కేటాయించిన తర్వాతనే తొలగించాలని చిరు వ్యాపార దుకాణదారులు కోరారు. గురువారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత 40,50 సంవత్సరాలుగా గర్ల్స్ హై స్కూల్ రోడ్డు ప్రక్కల ఓల్డ్ అశోక్ థియేటర్ ప్రహరీ గోడ ఆనుకొని సుమారు 20 మంది చిరు వ్యాపార దుకాణాలు ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలిపారు. చిరు వ్యాపారాలు నిర్వహిస్తూ క్రమంగా ఇంటి పన్నులు కరెంటు బిల్లులు చెల్లిస్తూ జీవనం కొనసాగిస్తున్నామన్నారు. సుమారు 20 సంవత్సరాల క్రితం అప్పటి మున్సిపల్ చైర్మన్ సోమారపు సత్యనారాయణ మున్సిపల్ కమిషనర్ రవీంద్ర ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్డు వెడల్పులో భాగంగా దుకాణాలకు సంబంధించిన భూములు సుమారు 75% మేర కోల్పోవడం జరిగిందన్నారు. మిగిలిన 25% స్థలంలో చిన్న రూములు నిర్మించి దుకాణాలు నిర్వహించుకుంటున్నామన్నారు దుకాణాలకు 2009లో అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి కరీంనగర్ జిల్లా కలెక్టర్ ద్వారా మాకు పట్టాలు మంజూరు చేయడం జరిగిందన్నారు అప్పటినుంచి అప్పటినుంచి వారు వారి కుటుంబ సభ్యులను సాఫీగా దుకాణాలపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నామని అన్నారు. గత మార్చి 26న మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇతరులు వారి దుకాణాల వద్దకు వచ్చి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా దుకాణదారులను ఖాళీ చేయాలని లేని ఎడల బలవంతంగా కూల్చివేస్తామని బెదిరిస్తున్నారని దీంతో చిరు వ్యాపారులు చేసుకునే దుకాణాలు కోల్పోయి వారు వారి కుటుంబ సభ్యులు రోడ్డున పడే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం కోరుతూ వారు హైకోర్టులు ఆశ్రయించి కేసు దాఖలు చేశారని, వారి అభ్యర్థనను మన్నించి హైకోర్టు స్టేటస్కో ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. గత మార్చి 24లో వారి దుకాణాల రూముల వెనకాల ఓల్డ్ అశోక్ థియేటర్లో ముందస్తు సమాచారం ఇవ్వకుండానే రాత్రి ఒంటిగంట సమయంలో కూల్చి వేశారని తెలిపారు. వారిని వారి కుటుంబ సభ్యులను రోడ్డు పాలు చేస్తారని దుకాణాల మీద ఆధారపడి జీవిస్తున్న వారి జీవితాలు వారి పిల్లలు చదువులు మధ్యంతరంగా ఆగిపోయే పరిస్థితి ఉందని వారి గదుల ఓనర్ లందరికీ భయం వేస్తుందన్నారు. అటు సింగరేణి, ఇటు మునిసిపల్ అధికారులు కూల కొట్టలేదు అంటున్నారని, మరి ఎవరు కూల కొట్టారని అసలు అదృశ్య వ్యక్తులు ఎవరు? అని ప్రశ్నించారు. హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి తదుపరి ఉత్తర్వులు వెలుపడే వరకు వారికి వారి షాపులకు రక్షణ కల్పించాలని పోలీసులను సంబంధిత అధికారులను కోరారు. అప్పటివరకు షాపుల జోలికి వస్తే ఊరుకోమని హెచ్చరించారు .ఈ సమావేశంలో రాందాస్, రాజకుమార్, కొండపాక సత్యనారాయణ, ఉపేందర్, కోటేశ్వర చారి, సురేష్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.






## ఓట్లు అడుక్కునే బిచ్చగాళ్లను

# దేవుడు కూడా క్షమించడు

## -తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**టీ మీడియా, మే 9, నర్సాపూర్:** 'దేవుడు గుడిలో ఉండాలి. భక్తి గుండెల్లో ఉండాలి. పోలింగ్ బూత్‌లో ఓట్ల కోసం అడుక్కునే బిచ్చగాళ్లలాగా (మీరు)%శొ% రాముడినో, హనుమంతుడినో వాడుకుంటున్నారంటే మిమ్మల్ని ఆ దేవుడు కూడా క్షమించడని చెప్పి బీజేపీవాళ్లకు చెబుతున్నా' అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నర్సాపూర్ కాంగ్రెస్ ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ%శొ% ప్రధాని మోడీ రాజ్యాంగాన్ని మార్చాలని, రిజర్వేషన్లు రద్దు చేయాలని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా బీజేపీకి రాముడు, హనుమాన్ జయంతి, బతుకమ్మ, బోనాల పండుగలు గుర్తుకు వస్తాయని ఎద్దేవా చేశారు. మన తాతలు, తండ్రులు ఈ పండుగలు చేయలేదా? అని ప్రశ్నించారు. కేసీఆర్ వయస్సు మీద పడిందని%శొ% ఇప్పటికైనా ఆయన బుద్ధి తెచ్చుకోవాలన్నారు. ప్రజలు ఆయనను బండకేసి కొట్టారని, తిరస్కరించారని%శొ% ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు డిపాజిట్ కూడా రాదన్నారు. మెదక్ నుంచి నీలం మధును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మధును గెలిపిస్తే మెదక్ ప్రాంతానికి మేలు జరుగుతుందన్నారు. ఈ పదేళ్లలో మోడీ మనకు ఇచ్చింది గాడిద గుడ్డు మాత్రమేనని ఎద్దేవా చేశారు. మెదక్ లోక్ సభ నియోజకవర్గానికి గొప్ప చరిత్ర ఉందన్నారు. 1980లో మెదక్ నుంచి ఇందిరాగాంధీ ఘన విజయం సాధించి%శొ% ప్రధాని అయ్యారని గుర్తు చేశారు. ఇందిరాగాంధీ ఉన్నప్పుడే ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. బీహెచ్ఈఎల్, ఇతర పరిశ్రమలు వచ్చినట్లు తెలిపారు. గత పాతికేళ్లుగా మెదక్ లోక్ సభ స్థానం బీఆర్ఎస్, బీజేపీ చేతిలో నలిగిపోయిందన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మల్లన్న సాగర్ కోసం భూములు గుంజుకున్నారని మండిపడ్డారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు, వెంకట్రామిరెడ్డిలు ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. కరీంనగర్ నుంచి వెంకట్రామిరెడ్డిని తీసుకువచ్చి ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నారన్నారు.



## సింహాద్రి అప్పన్నకు

# రూ.4లక్షల విరాళం

**టీ మీడియా, మే 9, సింహచలం :** శ్రీ వరాహాలక్ష్మీ నృసింహ స్వామి చందనోత్సవం సందర్భంగా విశాఖపట్నంలోని రైల్వే న్యూకాలనీకి చెందిన అక్షయ ఆసుపత్రి యాజమాన్యం రూ. 4 లక్షల విరాళం అందజేసింది. రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణకు ఈ చెక్కును అందజేశారు.దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి వినియోగించాలని ఆసుపత్రి యాజమాన్యం కోరింది. ఈ సందర్భంగా కమిషనర్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ, దేవాలయాల అభివృద్ధిలో దాతల సహకారం అత్యంత ప్రశంసనీయమన్నారు. ఎంతో మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆలయాలకు విరాళాలు అందజేస్తున్నారన్నారు.సింహచలం దేవస్థానంలో పలు దేవాలయల్లో భక్తుల సంఖ్యకు తగ్గట్లుగా నిత్య అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ అదనపు కమిషనర్ కె.రామచంద్రమోహన్, ఆలయ ఈవో సింగాల శ్రీనివాసమూర్తి, పాల్గొన్నారు. సమన్వయకర్తగా ఆలయ ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు గంట్ల శ్రీనుబాబు వ్యవహరించారు. ఈ సందర్భంగా దాతలకు చందనోత్సవ రోజున స్వామి నిజరూప దర్శనం భాగ్యం కల్పిస్తున్నట్లు గంట్ల శ్రీనుబాబు చెప్పారు.సింహగిరి పై గురువారం సాము గరిడీల కోలహలం నెలకొంది.